ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబరు 2023



దరఖాస్తుకు రేపు ఆఖరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూళ్లలో) చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుదారులు ఈనెల 30వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు అర్హత గల అభ్యర్థులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలన్నారు. సార్వత్రిక విద్యా అధ్యయన కేంద్రంలో ఏపి ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ఫీజు చెలించాలన్నారు. మరిన్ని వివరాలకు విద్యాశాఖ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ విభాగంలో సంప్రదించాలన్నారు.

హైలెవల్ కెనాల్ పూర్తయ్యేనా?

- ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తి
- భూసేకరణ చెల్లింపుల్లో జాప్యమే ప్రధాన కారణం
- డిసెంబర్ 31 నాటికి ముగియనున్న ఒప్పంద గడువు

హై లెవల్ కెనాల్ పనులను ఎన్నికల షెడ్యూల్ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2017లో మొదలైన పనులు ఒప్పందం ప్రకారం 2020 నాటికల్లా పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 80 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తవుతుందని వంశధార ఇంజనీరింగ్ అధికారులు చెప్తున్నారు. మరో 20 శాతం మేర పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. కాలువ తవ్వకాలకు సేకరించిన భూములకు చెల్లింపులు చేయకపోవడమే జాప్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు కొన్నిచోట్ల కోర్టు కేసులూ ఉండడం మరో కారణంగా ఉంది. దీంతో ప్రస్తుతం పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



బూర్జ మండలం కొల్లివలస, సింగన్నపాలెం మధ్య అసంపూర్తిగా హై లెవల్ కెనాల్ పనులు

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం, ఈ ఏడాది మార్చి 31వ తేదీకి పూర్తి చేసేలా పొడిగించింది. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం

హై లెవల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా, ప్రభుత్వం నేటికీ రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా, ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందుకోసం రూ.8.26 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. అదీగాక వర్షాలు పడుతుండడం కూడా పనులు ముందుకు సాగడానికి కొంత ఆటంకంగా మారింది.

పనులు సకాలంలో పూర్తి కావడం సందేహమే

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరం పడింది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములను ఆలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు.

దీంతో బూర్జ మండలం చిన లంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు. పనులు చేపడుతున్న తీరు, భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం వంటి అంశాల వల్ల కెనాల్ పనుల పూర్తికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

రిటర్న్ గిఫ్ట్ తప్పదు

- ఒపిఎస్‌ను అమలు చేస్తామని జిపిఎస్‌తో మోసం
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - కవిటి, సోంపేట

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను అమలు చేస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేశారని ఫ్యాప్టో, సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ తప్పకుండా ఇస్తామన్నారు. జిపిఎస్‌కు వ్యతిరేకంగా కవిటి మండల కేంద్రంలో ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు గురువారం ర్యాలీ నిర్వహించి, ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించి జిపిఎస్ ప్రతులను దగ్ధం చేశారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన సోంపేట మండల కేంద్రంలోని ఎంఆర్‌సి భవనం వద్ద జిపిఎస్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిపిఎస్ వద్దని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీలో ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించిందన్నారు. గ్యారంటీ లేని పెన్షన్ స్కీమ్‌కు గ్యారంటీ పెన్షన్ అని పేరు పెట్టడం తమను మోసం చేయడమేనన్నారు. అధికారంలోకి రాక ముందు జగన్ సిపిఎస్‌ను వారం రోజుల్లో రద్దు చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల తర్వాత సిపిఎస్ రద్దు చేయకుండా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ పేరుతో మరో మోసానికి తెరలేపారని ధ్వజమెత్తారు. పాత పెన్షన్ విధానం తప్ప మరేదీ ఆమోదించేది లేదని తేల్చిచెప్పారు. గత పిఆర్‌సిలో అంకెల గారడీ చేసిన జగన్ ప్రభుత్వం అదే రీతిలో జిపిఎస్ విధానంలో అవలంబిస్తోందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని సాధించే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గోపి, శ్రీరామ్మూర్తి, రాజబాబు, మొగ్గి గోపి, సిపిఎస్ ఇఎ సోంపేట మండల అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు నారాయణరావు, ఈశ్వరరావు, దాలిబందు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సోంపేటలో జిఒ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు



ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

3న బ్లాక్ డే

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రిని బర్తరఫ్ చేయాలి
- సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ జెఎసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

లఖింపూర్ ఖేరి ఘాతుకం జరిగిన అక్టోబర్ మూడో తేదీన బ్లాక్ డేగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. నగరంలోని క్రాంతి భవన్‌లో గురువారం నిర్వహించిన జెఎసి సమావేశంలో పలు సంఘాల నాయకులు మాట్లాడారు. 2021 అక్టోబర్ మూడో తేదీన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరిలో నిరసన తెలుపుతున్న ఆందోళనకారులపై జరిగిన మారణకాండకు సూత్రధారి అయిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని కోరుతూ అక్టోబర్ 3న జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో బ్లాక్ డే నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతుల పోరాట ఫలితంగా నల్ల చట్టాల అమలుకు వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం, రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఉపసంహరించుకోవడంతో పాటు ఉపాధి హామీని పట్టణ ప్రాంతాలకు విస్తరించి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహించ తలపెట్టిన బ్లాక్ డేని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఆదినారాయణమూర్తి, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఎఐకెఎంఎస్ నాయకులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్యాయం చేయొద్దు

- బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు
- ఆదివాసీ ఇయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు

పలాస : బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి ఆదివాసీలకు అన్యాయం చేయొద్దని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు అన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో రెండోసారి తీర్మానం చేయడం ఆదివాసీలకు చీకటి రోజుగా అభివర్ణించారు. కాశీబుగ్గలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి చెందిన బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో ఎలా చేర్చుతారని ప్రశ్నించారు. ఆ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు తమ రాజకీయ భవిష్యత్ కోసం ఆయా కులాలను ఎస్‌టిల్లో చేర్చేందుకు ప్రయత్నిస్తూ గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నకిలీ బెంతు ఒరియాలనూ ఎస్‌టి జాబితాలో చేర్చడం దారుణమన్నారు. అందరినీ ఇలా ఎస్‌టి జాబితాలో చేర్చుకుంటూ పోతే గిరిజన సంస్కృతి, సంప్రదాయలున్న ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పలాస నియోజకవర్గంలో ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారని, ఈ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివాసీలకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, పలాస నియోజకవర్గ అధ్యక్షులు పి.ఈశ్వరరావు, సభ్యులు మోహనరావు, సవర రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సవర జగన్నాయకులు

సంకేత భాషలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో సంకేత భాషలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం సందర్భంగా జిల్లా డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి నుంచి బాపూజీ కళామందిర్ వరకు గురువారం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంకేత భాషలపై అవగాహన పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుందని, వికలాంగుల్లో మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. అటువంటి ప్రతిభను వెలికితీసి ప్రజలకు చాటిచెప్పడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ర్యాలీలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, తహశీల్దార్ కె.వెంకటరావు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కవిత, డెఫ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విలీన పంచాయతీల్లో రోడ్ల మరమ్మతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలో విలీనమైన పంచాయతీల్లో సుమారు రూ.పది కోట్లతో తారు రోడ్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మున్సిపల్ అధికారులతో కలిసి పాత్రునివలస ప్రధాన రహదారిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విలీన పంచాయతీల్లో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో తారు రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇటీవల 80 అడుగుల రహదారిలో కొత్తగా వేసిన తారు కోటింగ్ పనుల నాణ్యతనూ పరిశీలించినట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కుశాలపురం, తోటపాలెం రహదారి మరమ్మతు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇంజినీరింగ్ పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.ఓబులేసు, మున్సిపల్ డిఇ కె.రమణమూర్తి, మున్సిపల్ ఇంజినీర్ పి.వి గంగాధర్, వార్డు ఎమైనిటీస్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

సిఎంకు ఎమ్మెల్సీ దువ్వాడ వినతి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మూలపేట పోర్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరారు. అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో గురువారం సిఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీలో ఉప్పునీరు పడుతోందని, తాగునీటికి ప్రత్యామ్నాయం చూపాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రంలో పలు కారణాలతో నేటికీ 18 మందికి పిడిఎఫ్ ప్యాకేజీ అందలేదని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. యువతకు స్పెషల్ పిడిఎఫ్ ప్యాకేజ్ రూ.ఐదు లక్షల వరకు ఇప్పించాలని విన్నవించారు. ఈ ప్యాకేజీని పోర్టు శంకుస్థాపన చేసిన తేదీ నుంచి గానీ భూసేకరణకు అంగీకరించిన తేదీ నుంచి గానీ ఇవ్వాలని కోరారు. పోర్టు నిర్మాణం అయ్యాక ప్రతి కుటుంబానికి శాశ్వత ఉద్యోగం ఇస్తామని హామీతో పాటు ఉద్యోగావకాశం కోసం ఎంప్లాయిమెంట్-ఆర్ నంబర్ కలిగిన కార్డును ఇప్పించాలన్నారు. గ్రామకంఠం భూములకు సర్వే చేయించి, అనుభవంలో ఉన్న నిర్వాహితులకు ఆర్ అండ్ ఆర్ నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్ అండ్ ఆర్ కమిటీ సభ్యులు జీరు శివరెడ్డి, కోత దాలయ్య, దారపు అప్పలరెడ్డి, జీరు శ్యామసుందరరావు ఉన్నారు.



సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ, మూలపేట గ్రామస్తులు

నూతన పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ గురువారం పరిశీలించారు. స్థానిక పిఎస్ఎన్ఎం స్కూల్‌లో కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాల నంబర్లు 263, 264, 265ను స్వయంగా పరిశీలించి ఆర్‌డిఒ, తహశీల్దార్లకు సూచనలు చేశారు. గతంలో ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో మూడు కేంద్రాలను ఓటర్ల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో సీలింగ్, పవర్ సప్లై, కిటికీలు, గది వైశాల్యాన్ని కొలతలు వేసి నివేదిక సమర్పించాలన్నారు. అలాగే ఎన్టీఆర్ మున్సిపల్ హై స్కూలు, చౌదరి సత్యనారాయణ కాలనీలో నూతన ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ బి.శాంతి, తహసిల్దార్ ఎన్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు ఉన్నారు.




పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ సమన్వయకర్త, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ హాజరు కానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు పాల్గొంటారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, అన్ని మండలాల జెసిఎస్ కో-ఆర్డినేటర్లు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, బిసి కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరు కావాలని కోరారు.



రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మండలంలోని రాగోలు పరిధిలో రోడ్డు విస్తరణలో భాగంగా ఈనెల 30వ తేదీన ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపి ఇపిడిసిఎల్ ఇఇ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు, లంకాం, వాకలవలస, గూడెం, రాయిపాడు, కొత్తరోడ్డు, అక్కివరం, తోటాడ, చంద్రయ్యపేట తదితర గ్రామాలకు ఆరోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.



కాశీబుగ్గ సిఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పలాస మండలం లొత్తూరుకు చెందిన గిరిజన ట్రాక్టర్ డ్రైవర్ సవర వల్లభరావుపై చేయి చేసుకున్న కాశీబుగ్గ సిఐ శంకరరావు, ఎస్ఐ ఖాదర్ బాషాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.గణపతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజనుడిపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించారు. పనిచేసే కార్మికుడు ఎవరు ఏ పని చెప్పినా చేస్తారని, కార్మికులపై పోలీసు అధికారులు తమ ప్రతాపం చూపించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధిత కార్మికునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




ఎంపికైన క్రీడాకారులు

సందడిగా రాష్ట్రస్థాయి ఎంపికలు

టెక్కలి : జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సందడి వాతావరణం మధ్య రాష్ట్రస్థాయి ఎంపికలు గురువారం నిర్వహించారు. అండర్-14, 17, విభాగంలో జిల్లా నలుమూలల నుంచి 125 పాఠశాలల నుంచి సుమారు 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, నెట్‌బాల్, రగ్బీ, రూప్ స్కిప్పింగ్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.వి.రమణలు ఎంపికలు చేపట్టారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నియోజకవర్గ కన్వీనర్ బాడాన నారాయణరావు తెలిపారు. ఎంపికైన రాష్ట్ర జట్టుని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు వై.శేఖర్‌బాబు, పి.తిరుపతిరావులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కాపల రఘునాథరావు, కుప్పిలి ప్రకాష్, లక్ష్మణరాజా, నాగళ్ల రమేష్, ఆదిశేషు, దివ్యవాణి, యరపత్ని వెంకటరమణ, యాగాటి త్రినాథరావు, పి.వి.రమణ, వాసుదేవరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు
మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్స్ షిప్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పురుషోత్తపురం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్స్ షిప్ పోటీలకు 8వ తరగతి చదువుతున్న ఉప్పాడ లిఖిత్ సాయి రెడ్డి, కె. చైతన్య ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ ఇతర అధ్యాపక బృందం శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎంపికైన విద్యార్థులు

దిశ డిఎస్‌పిని కలిసిన సువర్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని సంతబొమ్మాళి మండలం ఆకాశలకవరానికి చెందిన పరపటి ధర్మారావు, చంద్రకళ కుమార్తె సువర్ణ ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైంది. అదే పంచాయతీ సుగ్గువానిపేటకు చెందిన ఎస్.వాసుదేవ్ శ్రీకాకుళం పోలీస్ శాఖలో దిశ డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సువర్ణ తల్లిదండ్రులతో గురువారం డిఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సువర్ణ తల్లిదండ్రులకు వాసుదేవ్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ప్రజలకు మంచి సేవలు అందించి ప్రజలు అభినందనలు పొందాలని డిఎస్‌పి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రకళ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దిశ డిఎస్‌పి వాసుదేవ్

రోగాలు కొనితెచ్చుకుంటున్నారు

- జోరుగా కాలంచెల్లిన వస్తువుల విక్రయాలు
- విచ్చలవిడిగా ఆహార విక్రయ కేంద్రాలు

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు ఇటీవల తన ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమానికి స్థానికంగా ఉన్న ఓ దుకాణం నుంచి శీతల పానీయాలు తీసుకువచ్చాడు. వాటిలో కొన్ని వచ్చిన అతిథులకు పంచిపెట్టారు. ఈలోగా ఓ కుర్రాడు దానిపై ఉన్న తయారీ తేదీ గమనించి కాలపరిమితి ముగిసి అప్పటికే ఆరు నెలలు గడిచిందని చెప్పాడు. చేసేది లేక మిగతా సరుకు సదరు దుకాణ యజమానికి తిరిగి పంపించారు.

మరో గ్రామంలో ఓ చిన్నారి రూ.5ల బిస్కెట్ ప్యాకెట్ కొనుక్కుంది. ఇంటికి తీసుకువచ్చిన తరువాత ఆ చిన్నారి తండ్రి చూసి ఆ బిస్కెట్ ప్యాకెట్ కాల పరిమితి ముగిసి ఏడాది గడిచినట్టు గుర్తించారు. వెంటనే దాన్ని తీసుకుని ఆ దుకాణంలో అప్పగించి మరోసారి ఇటువంటివి అమ్మితే ఫిర్యాదు చేస్తానని ఆ యజమానిని హెచ్చరించాడు.

...ఇవి కేవలం కవిటి మండలానికి చెందిన సమస్య మాత్రమే కాదు, జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కాలం చెల్లిన వస్తువులు, నిబంధనలు పాటించని ఆహార విక్రయ కేంద్రాలతో ప్రజారోగ్యం అంగట్లో సరుకుగా మారుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటి వరకూ ఎక్కడా తనిఖీలు చేసిన జాడ లేదు. అంతేకాకుండా ఇలాంటి వార్తలు వచ్చిన తరువాత బడా వ్యాపారులను వదిలేసి ఏరోజుకారోజు అమ్ముకునే చిరు వ్యాపారులపై దాడులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీంతో పూర్తి సమాచారం ఇచ్చేందుకు వారుకూడా భయపడుతున్నారు.

విచ్చల విడిగా విక్రయాలు

ఇటీవల కాలంలో మారుమూల ప్రాంతాల్లో కూడా విపరీతంగా సూపర్ మార్కెట్లు, డిపార్ట్‌మెంట్ స్టోర్లు దర్శనమిస్తున్నాయి. పరిమితికి మించి సరుకు నిల్వ చేస్తుండడంతో నెలల తరబడి విక్రయాలు జరక్క వస్తువుల కాలపరిమితి ముగుస్తోంది. అయితే ఎప్పటికప్పుడు వీటిని గుర్తించి తొలగించకుండా సదరు షాపు యజమానులు విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నారు. చాలామంది పల్లె వ్యాపారులు వీరివద్ద అదే సరుకు కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. పదిమందిలో ఎవరో ఒకరు వీటిని గుర్తించడంతో సదరు వ్యాపారులు వారికి సర్ది చెప్పుకుంటున్నారు. కానీ ఇవేవీ గమనించని చాలామంది ప్రజానీకం కాలం చెల్లిన వస్తువులతో రోగాలు 'కొని'తెచ్చుకుంటున్నారు.

వీధికో ఆహార విక్రయ కేంద్రం

మరోవైపు పట్టణాల నుంచి పల్లెల వరకు ప్రతి వీధిలో ఏదోఒక రూపంలో ఆహార విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. హొటల్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, పానీపూరి కేంద్రాలుగా లక్షల్లో వ్యాపారం సాగుతోంది. వీటిల్లో చాలా ఆహార విక్రయ కేంద్రాలు విరివిగా నాసిరకం వస్తువులు ఉపయోగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వీరిపని మూడు బజ్జీలు, నాలుగు సమోసాల్లా సాగుతోంది. ముఖ్యంగా వీరు ఉపయోగించే వంట పాత్రల నుంచి తినే పాత్రపై ఉపయోగించే ప్లాస్టిక్ పేపర్ వరకు అంతా అనారోగ్యమే.

ఆహార తనిఖీ విభాగమా?

ఇటీవల సోంపేటలోని ఓ హొటల్‌కు వెళ్ళిన ఓ వినియోగదారుడు అక్కడ పరిసరాలు, పదార్థాలు సరిగా లేకపోవడంతో ఆహార తనిఖీ విభాగానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాడు. దీంతో ఆహార తనిఖీ విభాగమా? అంటే ఏంటి అని సదరు షాపు యజమాని అడగడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో అసలు ఆహార తనిఖీ విభాగం ఉందనే విషయమే తెలియదు. ఇటువంటి పరిస్థితుల్లో అటు కాలం చెల్లిన వస్తువులతో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లతో ప్రజల ప్రాణాలు గాల్లో పెట్టిన దీపాల్లా మారుతున్నాయి.



ఫాస్ట్ ఫుడ్ సెంటర్

కఠిన చర్యలు తప్పవు

కాలం చెల్లిన వస్తువులు అమ్మినా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, దాబాలు, హొటళ్లు నిర్వహించి ప్రజారోగ్యానికి హాని కలిగించినా కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాం. ముఖ్యంగా మండలాలు, గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు బాధితులు మాకు సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. అయితే కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత గొడవలతో కొంతమంది ఫోన్ చేస్తున్నారు. అది సరికాదు. ఎందుకంటే ప్రస్తుతం మా వద్ద సిబ్బంది కొరత ఉంది. దీన్ని దష్టిలో ఉంచుకుని జిల్లాలో కాలం చెల్లిన వస్తువులు విక్రయించినా, హొటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిబంధనలు పాటించకపోయినా ఈ నెంబరు కు 9704009989 సంప్రదిస్తే చర్యలు తీసుకుంటాం.

- కె.వెంకటరత్నం, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, శ్రీకాకుళం


క్షతగాత్రులను తీసుకెళ్తున్న 108 సిబ్బంది

ఆటోలు ఢీకొని 9 మందికి గాయాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు కూడలి నుంచి బురిడికంచరాం రహదారిలో గురువారం రాత్రి రెండు ఆటోలు ఢీకొనడంతో 9 మందికి గాయాలయ్యాయి. బురిడికంచరాంకు చెందిన పలువురు జి.సిగడాం మండలం ఆనందపుర అగ్రహారంలో ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన లగేజీ ఆటో బలంగా డీకొట్టడంతో బురిడికంచరాంకు చెందిన ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న వి.ధనలక్ష్మి, ఎం.ఉషారాణి, సంజు, నితీష్‌తో పాటు మరికొంతమంది గాయపడ్డారు. ఈ సంఘనటలో లగేజీ ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న పలువురు పరారయ్యారు. ప్రమాదం విషయం గ్రామంలో తెలియడంతో వారంతా అక్కడికి చేరుకుని బోల్తా పడిన ఆటోను పైకి లేపారు. గాయపడిన వారిని మూడు అంబులెన్స్‌ల్లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.


ధ్వంసమైన కిటికీ అద్దాలు

టిడిపి నాయకుని ఇంటిపై దాడి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ శ్రీనివాసనగర్లో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు యవ్వారి మోహనరావు ఇంటిపై బుధవారం అర్ధరాత్రి సమయంలో వైసిపి నాయకులు మూకుమ్మడిగా దాడికి దిగారు. ఆయన ప్రమాదం పసిగట్టి ఇంటినుంచి బయటకు రాకపోగా కిటికీ అద్దాలు పగలగొట్టి విధ్వంసానికి దిగారు. అరగంటపాటు ఆయన నివాసం వద్ద హల్‌చల్ చేయడంతో ఆయన కుటుంబం ఇంటిలోనే బిక్కుబిక్కు మంటూ కాలం గడిపింది. ఆ మూకలు వెళ్లిపోయిన అనంతరం టిడిపి నాయకులకు విషయం చెప్పడంతో వారంతా ఇంటికి చేరుకొని జరిగిన సంఘటన అడిగి తెలుసుకొన్నారు. వ్యక్తిగత దూషణలతోపాటు కులదూషణ చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. గురువారం బాధితుడుతో కలిసి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి అరగం పాటు ఇంటిచుట్టూ తిరుగుతూ బయటకు రావాలని కేకలు వేశారు.యార్లగడ్డ వెంకన్న చౌదరి మోహనరావును పరామర్శించారు.


వినాయకుని చిత్రపటాన్ని అందజేస్తున్న హారికాప్రసాద్

వినాయకుని మండపం సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని రైతుబజారు కూడలి వద్ద హారిక కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారిక ప్రసాద్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం రెవెన్యూ ధర్మాన ప్రసాదరావు దర్శించుకున్నారు. ఈ మేరకు హారికాప్రసాద్ దంపతులు ధర్మానకు దుశ్శాలువ కప్పి సన్మానించి వినాయక చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటా రైతు బజార్ కూడలిలో జిల్లాలోనే అతిపెద్ద విగ్రహాన్ని నెలకొల్పి సాంస్కృత, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న హారికాప్రసాద్ దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా నృత్య దర్శకుడు కాయల శివప్రసాద్ శిష్యులు సునీత ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కూచిపూడి కృత్యం ఆకట్టుకుంది.

ఇచ్ఛాపురం వైసిపిలో అంతర్యుద్ధం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధికార పార్టీ వైసిపిలో అంతర్యుద్ధం మొదలైంది. పార్టీలో టిక్కెట్ రేసు పోటీ పడుతున్నారు. దీంతో క్యాడర్‌లో ఎవరిని నమ్మాలో తెలియక అయోమయంలో పడ్డారు. ఈ సారి ఎన్నికలో అధికార పార్టీ నుంచి దాదాపు కళింగ సామాజిక తరగతికి చెందిన పిరియా సాయిరాజ్, విజయ టిక్కెట్ వస్తుందని మెజారిటీ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఈ నియోజికవర్గంలో ప్రధాన సామాజిక తరగతి రెడ్డిక, యాదవలకు టిక్కెట్ వస్తే తప్ప సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ఢీకొట్టడం అంత సులువు కాదని వాదిస్తోంది. కానీ, యాదవ సామాజిక తరగతి నుంచి నర్తు రామారావుకు ఎమ్మెల్సీ ఇవ్వడంతో టిక్కెట్ రేసులో వెనుక పడ్డారు. ఇక మిగిలిన రెడ్డిక సామజిక తరగతి నుంచి సరైన అభ్యర్థి లేరన్న వాదనా ఉంది. సొంత బలం, ఆర్థికంగా బలమైన అభ్యర్థి లేకపోవడంతో టిక్కెట్ రేసులో ఉన్నా, లేకపోయినా కొన్ని ఊహాగానాలు అమాంతంగా పైకెత్తుతున్నాయి. దీంతో పార్టీలో సమన్వయం కొరవడింది. రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఈ నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో మంచి పట్టు ఉండాలి. కేవలం పార్టీ టిక్కెట్‌పై ఆధారపడి పోటీ చేసినా ప్రత్యర్థిని ఓడించలేరు. టిక్కెట్ రేసులో ఉన్న అభ్యర్థులపై వ్యతిరేక ప్రచారం, ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధికార పార్టీలో నెలకున్న అంతర్యుద్ధంపై అధిష్టానం చొరవ తీసుకోలేకపోతే మరోసారి ఓటమి తప్పదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. ఈసారి ఇచ్ఛాపురంలో వైసిపి జెండా ఎగురవేయాలని గట్టి పట్టుదలతో ఉన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రకాల ప్రయత్నాలూ చేస్తున్నారు. అందులో భాగంగా ప్రధాన నేతలకు వివిధ రకాల కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, నామినేటెడ్ పదవుల కట్టపెట్టారు. ఈసారి మేముందుకు పోటీ చేయకూడదని టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇచ్ఛాపురం వైసిపి రాజకీయాలు రసవత్తరంగా సాగుతుంది. టిక్కెట్ కోసం ఒకరుపై ఒకరు బురద జల్లుకొని... చివరికి టిక్కెట్ వచ్చిన తరువాత అందరూ కలిసి మెలసి పార్టీ కోసం పనిచేస్తారా? లేదా? అని సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


పాదయాత్ర చేస్తున్న తులసీవరప్రసాదరావు

రెండో రోజుకు పాదయాత్ర

కొత్తూరు : మండలంలోని రెండో రోజు పొన్నుటూరు నుంచి పాతపట్నం వరకూ జగనన్న సంక్షేమ యాత్రను వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు గురువారం కొనసాగించారు. ఈ యాత్రలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ యాత్ర రుగడ, కోమానపల్లి, శోభ, గంగుపేట, సీది, చంద్రయ్యపేట, తీమర, తామర, కొరసవాడ, కాగువడ, బురగం మీదుగా పాతపట్నం చేరుకుంది. కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్లతో ఇ-క్రాప్ నమోదా?

ప్రజాశక్తి- బూర్జ

అవగాహన లేని సచివాలయం వాలంటీర్లతో ఇ-క్రాప్ నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు టిడిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనేపు రామకృష్ణ వ్యాఖ్యానించారు. మండలంలోని పెద్దపేట పంచాయతీ కొండపేలో వాలంటీర్లే ఇ-క్రాప్ నమోదు చేయడంతో రైతులు ఆయనకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయశాఖ అధికారులు, అసిస్టెంట్లు, సిబ్బంది ఉండగా, వారిని కాదని మండలంలోని పలు ప్రాంతాల్లో ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సెలవు పెడితే పక్క పంచాయతీలోని అసిస్టెంట్ల ద్వారా ఇ-క్రాప్ చేయించాలని సూచించారు. కానీ, అలా ఎవరు దొరికితే వాళ్లను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. అలాగే ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, ప్రభుత్వం స్పందించి ఎరువులను పంపిణీ చేయాలని కోరారు.

అగ్నిపథ్‌కు 82 మంది ఎంపిక

ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని యువత దేశ రక్షణ బాధ్యతల్లో పనిచేసేందుకు పెద్దఎత్తున ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బి.వి.రమణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఇండియన్ ఆర్మీ కాలింగ్‌లో శిక్షణ పొందిన 82 మంది అగ్నిపథ్‌కు ఎంపికయ్యారని పేర్కొనానరు. నగరంలోని బ్యాంకర్సు కాలనీలో ఉన్న ఆర్మీ కాలింగ్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ ఆర్మీకి సైనికులుగా, ఆఫీసర్స్ అందించే లక్ష్యంతో ఈ సంస్థను నెలకొల్పామని అన్నారు. అతితక్కువ కాలంలో 367 మందిని వివిధ కేటగిరిల్లో ఆర్మీలో చేరేందుకు సంస్థ శిక్షణ ఇచ్చిందన్నారు. తాజాగా విడుదలైన అగ్నిపథ్ రిక్రూట్ మెంట్ ఫలితాల్లో 82 మంది అగ్నివీరులను భారత సైన్యానికి అందించామని తెలిపారు. భారత దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనే ఆసక్తి కలిగిన యువతకు గడిచిన కాలంలో సైనిక సాయుధ దళాల్లో ఎంపికకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సరైన ప్రణాళికలతో క్రమశిక్షణతో కూడిన శారీరక శిక్షణ, మానసిక ఒత్తిడిని నివారించే దిశగా యోగా తరగతులు ఇండియన్ ఆర్మీ కాలింగ్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయి ఉన్నత అధికారులతో, విశ్రాంత ఆర్మీ అధికారులతో అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భారత రక్షణ దళాల స్థిరత్వంతోనే దేశం అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం అధికారుల సహకారంతో జవాన్ మొదలు ఆఫీసర్ కేడర్ ఉద్యోగాలకు వెళ్లే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సమావేశంలో విశ్రాంత హవాల్దార్ నాయక్ సుబేదార్, విశ్వనాథన్ కొల్లి, హవలదార్ దుంగ వాసుదేవరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణ

చేసింది గోరంత... హడావుడి కొండంత

- కెటి రోడ్డు పక్కన వదిలేసిన ప్రొక్లెయినర్
- ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి- పలాస

కెటి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి మూడున్నరేళ్లు కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న అందంగా తయారైంది. విస్తరణ పనులు ప్రారంభంలో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం కనిపించడం లేదు. చేసింది గోరంతే అయినా హడావుడి కొండంతలా చేస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. పనులు చేసే సమయంలో ట్రాక్టర్లు, జెసిబిలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎవరైనా కెటి రోడ్డు విస్తరణ పనులపై ప్రశ్నించినా, ప్రస్తావించినా హడావుడిగా రెండు మూడు రోజులపాటు తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారనే వాదన పట్టణ ప్రజల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి.

విస్తరణ పనులకు మూడున్నరేళ్లు...

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ పనులు చేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ముందుగా రోడ్డుపై నిర్మాణాలు చేపట్టిన భవనాలు, దుకాణాలను తొలగించారు. అనంతరం కొద్ది రోజులు విడిచి పెట్టి మళ్లీ కాలువ పనులు చేపట్టారు. ఈ పనుల్లో పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అక్కడక్కడ పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారన్న విమర్శలున్నాయి.. మరికొంత కాలం తర్వాత కొన్ని ప్రాంతాల్లో కాలువపై పలకలు వేశారు. పూర్తి స్థాయిలో పలకలు వేయకపోవడంతో దుకాణ యజమానులు తమ సొంత డబ్బులతో పనులు చేయించుకున్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి మట్టి పనులు ప్రారంభించారు.

మున్సిపల్ అధికారులు మట్టి పనులు చేపడుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. జెసిబిలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల సహాయంతో బయటకు మళ్లిస్తున్నారు. అయితే రోడ్డు చిన్నది కావడంతో రోడ్డుపై ట్రాక్టర్లు, జెసిబిలతో పనులు చేయడం ద్వారా బస్సులు, కారులు, వ్యాన్లు తదితర వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాస్తవానికి పనులు చేసే సమయంలో ఆ ప్రాంతంలో రోడ్డుని నిలిపి వేసి పనులు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా పనులు చేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. విస్తరణ పనులు చేసే సమయంలో రాత్రి వేళల్లో గానీ తెల్లవారుజామున పనులు చేపడితే ఎటువంటి ఇబ్బంది ఉండదని పట్టణ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా ప్యారడైజ్ రెస్టారెంట్ సమీపం రోడ్డుపై జెసిబి అలానే వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై మున్సిపల్ ఎఇ అవినాష్‌ను వివరణ కోరగా విస్తరణ పనులు త్వరితగతిన చేపడుతున్నామని, రాత్రి వేళల్లో పనులు చేపడితే పనుల్లో నాణ్యత లోపిస్తుందనే ఉద్దేశంతో పగలు సమయంలో పనులు చేయాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పనులు చేపడతామని చెప్పారు.



నిలిచిన వాహనాలు

అప్పయ్యదొర ఆశయాలు కొనసాగిస్తాం


మాట్లాడుతున్న విజయకుమార్ దొర

ప్రజాశక్తి- పలాస

తన తండ్రి, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర ఆశయాలను కొనసాగించేందుకు రాజకీయాల్లో పున్నప్రవేశం చేస్తున్నానని, ఆయన అభిమానులు ఆదరించాలని కుమారుడు హనుమంతు విజయకుమార్ దొర (చిట్టి) కోరారు. పద్మనాభపురం శివాలయం గురువారం విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి అప్పయ్యదొర టిడిపిలో ఎంపీగా, కాంగ్రెస్ పార్టీలో టెక్కలి ఎమ్మెల్యేగా విజయం సాధించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితంలో అవినీతికి చోటు లేదని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేశారని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చినా ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో ఇంకా నిర్ణయించలేదని, తన అవసరం ఏ పార్టీకి ఉందో వారి పిలుపు మేరకు తమ సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. త్వరలో అప్పయ్యదొర సొంత మండలాలైన నందిగాం, పలాస మండలాల్లో తన అనుచరులతో పర్యటించి అభిమానులను కలిసి రాజకీయంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సిర్ల రవిచంద్ర (బుజ్జి), బుదిరెడ్డి శ్రీనివాస్, చిత్రాడ ప్రవీణ్, టి.శ్రీను, అఖిలేష్, చిన్నారి, బి. జన, గుంట ధర్మారావు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సూర శ్రీను

పలుచోట్ల అన్నదానం

కొత్తూరు : స్థానిక దేవరవీధిలోని వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యర్లంకి కొండలరావు, పొగిరి రవి, గోవిందరావు, ఆశపు ఆనందరావు, గణేష్, పుచ్చల త్రినాథ్, నారాయణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని కుశాలపురంలో ఎస్-ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు వినాయక నవరాత్రుల పురస్కరించుకుని అన్నదానం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని రెడ్డికి బజారు వీధిలో వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా సింహగర్జన యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్, మాజీ సర్పంచి దుక్క చాణిక్య రెడ్డి, బసవ పరమేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి సింహం గర్జన యువజన సంఘ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.


కులగణనతో అణగారిన వర్గాలకు న్యాయం

రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ లోకేశ్వరరావు


లోకేశ్వరరావు

ఇచ్ఛాపురం : రాష్ట్రంలో కుల గణనతో అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క. లోకేశ్వర రావు రెడ్డి అన్నారు బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కొత్తగా కులగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, 100 ఏళ్ళ తర్వాత కులగణన మన రాష్ట్రం తొలి అడుగు వేయడం శుభ పరిణామన్నారు. దీనిపై అసెంబ్లీలో బీసీ సంక్షేమ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కష్ణ కమిటీ నివేదికను ప్రవేశపెట్టారు. దీంతో సామాజిక రాజకీయ ఆర్థిక ఆరోగ్య విద్యా వంటి ఫలాలు అందుకునేందుకు దోహదపడుతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులగణన చేయడం వల్ల ఆయా కులాలలో అణగారిన వారి గురించి తెలుసుకునేందుకు మంచి అవకాశం ఉంటుంన్నారు. వారిని గుర్తించి వారికి ప్రభుత్వ ఫలాలు అందించడానికి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

తెగుళ్లపై అప్రమత్తం


పరిశీలిస్తున్న ఎఒ మోహనరావు

ఆమదాలవలస : వరి పంటల వచ్చు తెగుళ్లపై రైతుల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని దూసి, నిమ్మతొర్లాడ, కొరపాం, జి.కె.వలస గ్రామాల్లో వరి పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ సమయంలో వరిలో పలు రకాల తెగుళ్ళ సోకే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా అగ్గి, మెడ విరుపు తెగులు ఆశించినప్పుడు ఆకులపై ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగు గల నూలు కండే ఆకారపు మచ్చలు, ఆకులు ఎండిపోయి తగలబడినట్లు కనిపిస్తాయని అన్నారు. అందువల్లే ఈ తెగులను అగ్గి తెగులు అంటారని తెలిపారు. పిలకల కనుపుల వద్ద ఆశిస్తే ఆ ప్రదేశం వద్ద విరిగి పిలక వాలిపోతుందని, వెన్నెల మెడ భాగంలో తెగులు ఆశించడం వల్ల వెన్నులు విరిగి కిందకు వాలిపోతాయని అన్నారు. దీనినే మెడ విరుపు తెగులు అంటారని అన్నారు. వెన్నులో తాలు లేక సగం నిండిన గింజలు ఏర్పడతాయని అన్నారు. ఈ తెగులు నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా రైతు భరోసా కేంద్రాల్లోని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. లేకుంటే తన దృష్టికి సమస్యలను తీసుకొస్తే పరిష్కరిస్తానని అన్నారు. ఈయన వెంట విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మెళియాపుట్టి : అంగన్వాడీల కార్యకర్తలు, ఆయాల నియామానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ పిఒ విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సుందరాడ, సానిపాలెం, శేఖరాపురం, దీనబంధపురం కేంద్రాలకు సహాయకులు, పొగడవెల్లి, గంగన్నపేట గ్రామాల్లో మినీ అంగనవాడీల కార్యకర్తల నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబరు 5లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

రేపు వైద్య శిబిరం

బూర్జ : మండలంలోని దొంకలపర్తలో ఈ నెల 30న ఏర్పాటు చేయనున్నట్లు బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజేష్ తెలిపారు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే నిర్వహించామన్నారు. వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు ఆరోగ్య సమస్యలున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారి పావని ఉన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం : రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ సూచించారు. మండలంలో కొఠారి గ్రామ పంచాయతీలో గుడియా చేరువ వీధిలో జెడ్‌పి గ్రాంట్ నుంచి రూ.3 లక్షలు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి దుక్క ధనలక్ష్మి, మాజీ ఎంపిపి కె.మోహనరావు, విఆర్ఒ.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు సిఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తిలారు, నారాయణవలస తదితర పంచాయతీల లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో అర్హత ఉంటే చాలని ఎలాంటి సంక్షేమ పథకమైనా లబ్ధిదారుల ఇంటికే నేరుగా చేరుతుందని అన్నారు. కార్యక్రమంలో పంకు రాము, సింగుపురం వినోద్ పాల్గొన్నారు.

బిజెపి నాయకుల పర్యటన

రణస్థలం రూరల్ : రణస్థలం, లావేరు మండలాల్లో బిజెపి జోనల్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, విజయనగరం జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు గురువారం పర్యటించారు. అనంతరం ఎన్ఇఆర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, మండల ప్రవాస్ ప్రముఖ్, ఉప్పలపాటి రాజేష్‌వర్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఒపిఎస్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస ఎస్‌సి, ఎస్‌టి రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పేకేటి రామారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు, సంఘ నిర్మాణం, కార్యవర్గ విస్తరణ వంటి అంశాలు ప్రధాన అజెండాగా జరిగిన సమావేశంలో ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని ఉద్యోగులపై రుద్దడాన్ని ఆ సంఘ అధ్యక్షులు పేకేటి రామారావు తీవ్రంగా ఖండించారు. సిపిఎస్‌ని రద్దుచేసి ఒపిఎస్‌ని పునరుద్ధరించవలని ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. కార్యవర్గ విస్తరణలో భాగంగా నూతన కోశాధికారిగా బోకర దుర్యోధన మాస్టర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నగిరి మోహన్ రావు, బంగారు తాతారావు, రాష్ట్ర కార్యదర్శి కలిగాన ఆనంద్, వివిధ మండలాల అధ్యక్షా, ప్రధాన కార్యదర్శులు ఇప్పిలి ధర్మారావు, రట్టి లక్ష్మీనారాయణ, బుస్క ఈశ్వరరావు, కోన రాము, తుంగాన సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- బూర్జ

ప్రజా సమస్యలపై పోరాటం చేసి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన సూర్యారావు సేవాతత్పరుడని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ తమ్మినేని కామరాజు అన్నారు. ఆయన శ్రీకాకుళం రోటరీ క్లబ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో బూర్జ వైస్ ఎంపిపి సూర్యారావును ఘనంగా సన్మానించారు. సూర్యారావు విద్యారుల సమస్యలపై పోరాడిన విద్యార్థి నాయకునిగా, లోక్‌సత్తా ఉద్యమసంస్థ జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తూ పలు ప్రజా సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో తన స్వగ్రామం ఒవి. పేట గ్రామానికి, సమాజానికి అందించిన సేవలు ప్రత్యేకమని అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షులు అన్నెపు సత్యనారాయణ, సంఘసభ్యులు ఉన్నారు.

పలువురికి ఆర్థికసాయం

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన టి.అరుణ భర్త ఇటీవల మతి చెందడంతో ఆయనతో చదువుకున్న విద్యార్థులు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కె. అప్పలస్వామి, వినుత, లక్ష్మణ్, జగన్, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు బిట్ 2 గ్రామానికి చెందిన లింగాల లోకమ్మ గురువారం మతి చెందింది. వారి కుటుంబానికి సర్పంచ్ వై.ధర్మారావు పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే గ్రామస్తులు రూ.5260లు నగదును అందించారు.

కవిటి : మండలంలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ మరోసారి తన దాతృత్వం చాటుకుంది. రెండు నెలల కిందట మండలంలోని నెలవంక గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో తమ సర్వస్వం కోల్పోయిన పీత బైరమ్మ, సింహాద్రికి అండగా నిలిచింది. బాధితుల ఇంటి నిర్మాణానికి అవసరమైన రేకులను గురువారం అందించారు. అనంతరం వీరు మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకుని బాధితులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బీమాతో ధీమా

ప్రజాశక్తి- కవిటి

ఆపద సమయంలో ప్రభుత్వం అందించే ప్రమాద బీమా బాధితులకు భరోసా కల్పిస్తుందని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. కవిటి మండలం పెద్దకర్రివానిపాలెం గ్రామానికి చెందిన కర్రి కృష్ణారావు చేపలవేట కోసం కర్ణాటక వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించాడు. దీంతో అతని కుటుంబ సభ్యులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించే మత్స్యకార ప్రమాద బీమా రూ.10 లక్షలు మంజూరైంది. అందులో మొదట విడతగా రూ.5 లక్షల చెక్కును కృష్ణారావు కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో మత్స్యకారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, ఎంపిటిసి రామయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు దశ షణ్ముఖరావు, ఎస్‌పి ప్రవీణ్, ధనుజయం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ప్రకాష్

రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు



ఇచ్ఛాపురం : నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

రాజకీయ కక్షతోనే చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద న్యాయవాదులు, వైద్యులు చంద్రబాబు నాయుడుకు మద్దతు పలుకుతూ 'నేను సైతం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అవినీతి మచ్చలేని నాయకుడు నారా చంద్రబాబు నాయుడు పై గత ప్రభుత్వాలు 24 విచారణ కమిషన్లు వేసి 29 కేసులను న్యాయస్థానంలో దాఖలు చేసినప్పటికీ నేటికీ ఒక్క కేసులో కూడా ప్రాథమిక సాక్ష్యం కూడా నిరూపించలేకపోయారని అన్నారు. అనంతరం రిలే నిరాహార దీక్ష వద్ద ఏర్పాటు చేసిన బాబుతో నేను ఫ్లెక్సీ పై పలువురు న్యాయవాదులు సంతకాలు చేసి చంద్రబాబు నాయుడు కు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి, టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షులు చాపర సుధాకర్, రిటైర్డ్ ఆర్‌డిఒ పిఎంజి బాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షులు బోర అనిల్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : మానవహారం చేస్తున్న టిడిపి నాయకులు

ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నేను సైతం రిలే నిరాహార దీక్షలో సిపిఎం నాయకుడు, న్యాయవాది బొడ్డేపల్లి మోహన రావు పాల్గొనిసంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధరాత్రి చంద్రబాబు బస చేసిన వసతి పై దాడి చేసి జనాన్ని భయ బ్రాంతులకు గురిచేసి తెల్లవారుజామున అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యాన చంద్రబాబును అకారణంగా అక్రమ అరెస్ట్ చేసినందుకు పట్టణంలో గత 16 రోజులుగా నిరశన దీక్ష విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా నల్ల బెలూన్లతో ఎమ్మెల్యే అశోక్, నియోజకవర్గ బిసి యాదవ సాధికారిత సమితి అధ్వర్యంలో టిడిపి శ్రేణులు నిరశన వ్యక్తం చేశారు. బి సి యాదవ సాధికారిత సమితి సభ్యులు కాళ్ల ధర్మా రావు, మడ్డు రవి, బోరుబద్ర లోహి దాసు, కొర్రయి వాసు, కాళ్ల జయదేవ్, తదితరులు రిలే నిరాహారదీక్షలు చేశారు.

పోలాకి మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరహార దీక్షలు చేపట్టారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుపై ప్రభుత్వం కక్ష పూరితంగా చేయించిన అక్రమ అరెస్టు నుంచి విడుదల అయినంతవరకూ ఈ పోరాటాలు కొనసాగుతాయని తెలుగు దేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో డోల ప్రసాద్ రావు, రోణంకి కృష్ణం నాయుడు, లుకలాపు రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రిమాండ్‌కు నిరసిస్తూ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన పలాసలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారానికి 16వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష, రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణ్, నియోజకవర్గ అధ్యక్షులు బత్తిలి తారక్, తెలుగు యువత అధ్యక్షులు నవీన్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో టిడిపి కార్యాలయం వద్ద నాయకులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో



శ్రీకాకుళం అర్బన్ : బుర్రకథను ప్రదర్శిస్తున్న కళాకారులు

నియోజకవర్గ టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, రాష్ట్ర అద్యక్షుడు బోయిన గోవిందరాజులు, గొండు లక్ష్మణరావు, మెండ అప్పారావు, మట్ట సుందరమ్మ, టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, టెక్కలి మండల మహిళ అధ్యక్షులు మెండ దామయంతి పాల్గొన్నారు.

టెక్కలి పట్టణం కోదండరామ వీధిలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెయ్యి ప్రీతీష్ చంద్ ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు రిమాండ్‌కు నిరసిస్తై... ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోళ్ల కామేష్, పేర మురళి, సునీల్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష 16వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, గుత్తు చిన్నారావు, గండేపల్లి కోటేశ్వరరావు, సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, సురకాశి వెంకటరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన బుర్రకథను ప్రదర్శించారు.



దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

పోరాటాల సూరీడు భగత్‌సింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ స్వాతంత్ర్య పోరాటంలో సూరీడుగా భగత్ సింగ్ నిలుస్తారని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలను నగరంలోని గాంధీ మందిరంలో గురువారం నిర్వహించారు. విగ్రహదాతలు నేమాని వేదవతి, దేవీ శ్యామ్ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు అతిథి, ఎన్‌వైకె కో-ఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఉజ్వల్ మాట్లాడుతూ అతి చిన్న వయసు లోనే దేశభక్తిని గుండెల నిండా నింపుకుని బ్రిటిష్ దురాగాతాలను ఎదుర్కోవడానికి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ప్రశ్నించే తత్వంతో పాటు అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ప్రపంచానికి అందించారన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, పైడి



శ్రీకాకుళం అర్బన్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అధికారులు

హరనాథరావు, బాడాన దేవభూషణ్, పందిరి అప్పారావు, మెట్ట అనంతభట్లు, నక్క శంకరరావు, పొన్నాడ రవికుమార్, శ్రీనివాసరావు, కొమ్ము రమణమూర్తి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని జలక లింగుపురంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భగత్ సింగ్ జీవితం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని జనసేన నాయకులు దుక్క బాలరాజు సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతి రావు అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నరసన్నపేట : మండలంలో భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలను ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ 23 సంవత్సరాల యవ్వన వయసులో ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరుడిని భగత్ సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ఎ.రాము,ఎన్. సాంబశివరాజు, జాన్, వెంకటేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలం లొద్దపుట్టి గ్రామంలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్ ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జన సేన ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో లొద్దపుట్టి గ్రామ పెద్దలు తిప్పన దామోదర్ రెడ్డి, రోకళ్ల భాస్కరరావు, కలియ గౌడో, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలోని లాలపెట, కస్పావీధి మసీద్‌ల్లో ఘనంగా ఇస్లాం మత స్థాపకుడు మహమ్మద్ ప్రవక్త జయంతిని ముస్లిములు మిలాద్ ఉన్ నబీ పండుగ నిర్వహించారు. అనంతరం ఇచ్ఛాపురం ముస్లిం జామత సొసైటీ ఆధ్వర్యాన క్రౌన్ బాన్ క్వీట్ కళ్యాణ మంటపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తకియ దర్గా అధ్యక్షుడు అబ్దుల్లా, జోహర్ ఖాన్, ఎండీ అహ్మద్ అలీ, ఎండీ పరిద్దుద్దిన్, రఫీ, అలీమ్ ఖాన్, అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

పలాస : మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా గురువారం ముస్లిముల పర్వదినమైన ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గలోని జామియా మసీదు నుంచి పలాస మూడు రోడ్ల కూడలి వరకూ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలోని మసీదుల్లో ముస్లిములు వేడుకలు నిర్వహించారు. నగరంలోని జామియా మసీదు, ఇతర మసీదుల నుంచి పెద్దఎత్తున ముస్లిములు చేరుకుని జిటి రోడ్, ఏడు రోడ్ల కూడలి, పాలకొండ రోడ్డు డేఅండ్‌నైట్ కూడలి, రామలక్ష్మణ, సూర్యమమల్ కూడళ్ల వరకూ ర్యాలీ నిర్వహించారు.



శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

అనంతరం జామియా మసీదులో ప్రవక్త జీవిత చరిత్రను బోధనలను ఇమాం వివరించారు. కార్యక్రమంలో రెహమాన్, బహదూర్ బాష, నిజాముద్దీన్, మహిబుల్లా ఖాన్, బేగ్, సలీంఖాన్, షునుద్దీన్ పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణం అందరి బాధ్యత

టెక్కలి : సమాజంలో మార్పుని తీసుకొచ్చే సామాజిక స్పృహ ఉన్న రచనలకు అంతంలేదని నిరూపించిన కవి గుర్రం జాషువా అని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. ప్రజాకవి, గుర్రం జాషువా జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అననుకూల పరిస్థితుల్లోనూ మనిషి తట్టుకునే పరిస్థితి ఉండాలన్నారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్యాపకులు డాక్టర్ వై.లీలాపద్మజ మాట్లాడుతూ జాషువా రచనలు పేదలకు అండగా నిలబడ్డాయని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, ఎ.రామారావు, బి.ఝాన్సీరాణి, కందిగొల్ల, కసవయ్య పాల్గొన్నారు.

అలాగే స్థానిక ఎస్‌టి బాలికల సంక్షేమ వసతిగృహంలో జాషువా, భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిన జిల్లా ఆధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వసతిగృహ మేట్రిన్ దేవాది సునీత, పాలవలస ధర్మారావు, డి.ఎ.స్టాలిన్, తమ్మినేని వైకుంఠరావు, జి.వి.రెడ్డి మాస్టార్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్'పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వచ్ఛ భారత్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి సూచించారు. నగరంలోని కళాశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ ర్యాలీని గురువారం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ సేవా వారోత్సవాల్లో భాగంగా ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి వచ్చే 2 వరకు స్వచ్ఛత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు యువ క్లబ్ కో-ఆర్డినేటర్ కె.అప్పారావు, హేమసుందర్ పాల్గొన్నారు.

రవికుమార్ ప్రకటనలు అవాస్తవం

పొందూరు: పొందూరు మండలం రాపాక గ్రామం నుంచి కొన్ని కుటుంబాలు వారు తెలుగుదేశం పార్టీలో చేరినట్లుగా టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ చేసిన ప్రకటనలో వాస్తవం లేదని పొందూరు పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి, గ్రామ సర్పంచ్ ప్రతినిది కొంచాడ గిరిబాబు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావులు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. రాపాక గ్రామం నుంచి ఏ ఒక్కరు టిడిపిలో చేరలేదని, చేరిన వారంతా పూర్వం నుంచి టిడిపికి కార్యకర్తలగానూ, అనుకూలురుగా పని చేస్తూన్నారని, వారికే కొత్తగా పచ్చ కండువాలు వేసి పార్టీలో చేరినట్లుగా ప్రకటించారని వివరించారు. ఉనికి నిలబెట్టుకోవాడానికి ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు వేసున్నారని విమర్శించారు.



ఫ్రీజర్‌ను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు ఆస్పత్రికి ఫ్రీజర్

కొత్తూరు : భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు గురువారం శవపేటికను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి అందించారు. ఈ ప్రాంతవాసులకు ఎవరికైనా అవసరం ఉన్నట్టయితే రవాణా ఖర్చులు చెల్లిస్తే అవసరమైన వారికి ఇస్తామని, దీనికి ఎటువంటి రుసుం ఉండదని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.రవి, డి.దేవరాజ్, నడిమింటి జగదీశ్వరరావులు పాల్గొన్నారు..

రేపు అల్లుకోలలో ఆరోగ్య సురక్ష

పలాస: మండలంలోని అల్లుకోల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎన్. రమేష్ నాయుడు కోరారు. మండలంలోని అల్లుకోల గ్రామంలో గురువారం ఆయన సందర్శించారు. ఆ కార్యక్రమం పై అధికారులకు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయనతోపాటు సర్పంచ్ దువ్వాడ వామాక్షి, దువ్వాడ రవి కుమార్, డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.